క్లుప్తంగా

మహిళా న్యాయవాదులకు వ్యాసరచన పోటీలు


పోటీల్లో పాల్గొన్న మహిళా న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టులో మహిళా న్యాయవాదులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కొత్తగూడెం కోర్టు హాల్లో నిర్వహించిన పోటీలను న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి జి.భానుమతి ప్రారంభించారు. విజేతలకు జడ్జి జి.భానుమతి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ వి.పురుషోత్తమరావు, పి.నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు కాసాని ఐలయ్య సంస్మరణ సభ


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సుజాతనగర్: ఈ నెల 9న సుజాతనగర్‌లో నిర్వహించనున్న కాసాని ఐలయ్య సంస్మరణ సభకు వేలాదిగా తరలిరావాలని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సభ కోసం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన స్థలాన్ని పార్టీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. సభకు తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీను, లిక్కి బాలరాజు, కున్సోత్ ధర్మా, వీర్ల రమేశ్, నర్రా శివరామకృష్ణ, గండమాల భాస్కర్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకే కోల్ టెండర్లు వేయాలి


తీర్మానం కాపీని ప్రదర్శిస్తున్న నాయకులు

టేకులపల్లి: సింగరేణి సంస్థలో కోల్ ట్రాన్స్‌పోర్టు టెండర్లు గిట్టుబాటు ధరకే వేయాలని కోయగూడెం టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నేలవెల్లి నరసింహారావు కోరారు. శుక్రవారం టేకులపల్లి లారీ ఆఫీస్ వద్ద అసోసియేషన్ సమావేశం నిర్వహించగా.. నర్సింహారావు మాట్లాడారు. కోయగూడెం ఓసీ నుంచి రుద్రంపూర్ సీహెచ్‌పీకి కోల్‌ట్రాన్స్‌పోర్ట్ టెండర్ షెడ్యూల్ విడుదల చేసిందని, దీనిని ఒక టన్నుకి రూ.176.50 పైసలు చెల్లించే విధంగా కాంట్రాక్టర్లు టెండర్ వేయాలని తీర్మానం చేశామని, ఈ మేరకే టెండర్ వేయాలని, లేనిపక్షంలో బొగ్గు రవాణాను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జకాత్‌తోనే పేదరిక నిర్మూలన

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో పేదరిక నిర్మూలన కోసమే ఇస్లాంలో జకాత్ తప్పనిసరిగా చేస్తారని జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్, రామవరం శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ భాసిత్ అన్నారు. శుక్రవారం రామవరం మసీదులో ఆయన మాట్లాడారు. ధనికులు ఏడాది పాటు వారి దగ్గర నిల్వ ఉన్న ధనంలో రెండున్నర శాతం స్వచ్ఛందంగా పేదలకు పంచాలన్నది అల్లా ఆదేశమన్నారు. ఖాసిం, రెహాన్, యాకూబ్, జాఫర్ పాల్గొన్నారు.

10న ఐటీఐ అప్రెంటిస్‌షిప్ మేళా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో ఈ నెల 10న జరగనున్న అప్రెంటిస్‌షిప్ మేళాను స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌తో శుక్రవారం సమావేశమైన ఆయన మేళా ఏర్పాట్లపై చర్చించారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కొత్తగూడెం వీ–కేర్ ఆస్పత్రి నిర్వాహకులు గుత్తా నవీన్ శుక్రవారం పౌష్టికాహారం ఏర్పాటు చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న నైట్ క్లాసులకు హాజరయ్యే టెన్త్ విద్యార్థులు 30 మందికి భోజనం ప్యాకెట్లు అందించగా హెచ్‌ఎం సంజీవరావు పంపిణీ చేశారు. శ్రీనివాసరావు, రమేశ్, కృష్ణారావు, కరుణాకర్ పాల్గొన్నారు.



ఆమె రాణిస్తోంది..

- అన్నిరంగాల్లోనూ అతివల పరుగులు
- పురుషులతో సమానంగా ముందుకు..
- ఇళ్లలోనూ ఆడపిల్లలపై తగ్గుతున్న వివక్ష

ఉద్యోగ, క్రీడా.. ఇతర అన్ని రంగాల్లోనూ గతంతో పోలిస్తే అతివలు రాణిస్తున్నారు. అందివచ్చే అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇళ్లలోనూ గతంతో పోలిస్తే అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను చదివిస్తుండడంతో వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తోంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు.. ఒకరు లేదా ఇద్దరు అమ్మాయిలు జన్మించినా వారి ఎదుగుదలకు చేయూతనిస్తున్న తల్లిదండ్రుల వివరాలతో కథనాలు..

అమ్మాయిల్లోనే అబ్బాయిలను చూస్తూ..


పిల్లలకు కరాటే శిక్షణ ఇస్తున్న నిహారిక

కొత్తగూడెం టౌన్: ఆడపిల్లలకు చదువులు ఎందుకు, క్రీడల్లో శిక్షణ ఎందుకు అని అందరూ ఎగతాళి చేసినా క్రీడల్లో తీర్చిదిద్దాడు ఓ తండ్రి. కొత్తగూడెం త్రీ ఇంక్‌లైన్‌కు చెందిన పోలీస్ శాఖ చిరు ఉద్యోగి పెదపాటి కాశీహుస్సేన్ – సత్యవతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. అయినా ఎలాంటి బాధ లేకుండా వారి ఉన్నతికి కృషి చేశారు. ఆయనే పలువురికి క్రీడల్లో శిక్షణ ఇస్తుండడంతో ఇద్దరు కుమార్తెలు నిహారిక, అమృతవర్ష కూడా శిక్షణ పొందారు. దీంతో వారు రెజ్లింగ్, కరాటే, కిక్‌బాక్సింగ్‌లో తర్ఫీదు పొంది జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించారు. ప్రస్తుతం నిహారిక బీటెక్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా, అమృతవర్ష అశ్వారావుపేటలోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో చదువుతోంది. కాగా, నిహారిక మరికొందరికి కరాటే శిక్షణ ఇస్తుండడం విశేషం.


అమృతవర్ష

చదువు లేకపోయినా అన్నీతానై...


కాళ్లు కడుగుతున్న మనవలు, మనవరాళ్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ కూలీలైన్‌కు చెందిన బాసాని లక్ష్మీబాయి భర్త సింగరేణిలో ఉద్యోగం చేస్తూ గని ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆమెకు వారసత్వంగా సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో ఆయా ఉద్యోగం రాగా 1995లో చేరింది. అప్పటికే నలుగురు కుమార్తెలు ఉన్నా కుంగిపోకుండా వారికి మంచి చదువులు చెప్పించింది. పిల్లలంతా భర్త చనిపోయే నాటికి ఏళ్ల వయస్సు వారే అయినా మనోధైర్యం కోల్పోలేదు. ప్రస్తుతం నలుగురు కుమార్తెలు చదువుకుని ప్రయోజకులు కావడం.. ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న వారికి ఇచ్చి వివాహం జరిపించింది. ఇటీవల లక్ష్మీబాయి 79ఏళ్లు పూర్తి చేసుకుని 80వ సంవత్సరంలోకి అడుగుపెట్టగా..... కుటుంబీకులు వేడుకగా నిర్వహించారు. అంతేకాక తమ ఉన్నతికి తోడ్పడిన తల్లి కాళ్లు బిడ్డలతో పాటు వారి కుటుంబీకులు కడిగి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రోత్సాహంతో ముందడుగు


తల్లిదండ్రులతో చైత్ర, ఐశ్వర్య

జూలూరుపాడు: జూలూరుపాడులో నివాసం ఉంటున్న పాపకొల్లుకు చెందిన బండ్ల వెంకటేశ్వర్లు, పద్మ దంపతులకు ఇద్దరూ ఆడ పిల్లలే. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారు మగ సంతానం కల్గలేదని బాధపడకుండా పెద్ద కుమార్తె చైత్రను ఫార్మసీ చదివించగా, చిన్న కుమార్తె బండ్ల ఐశ్వర్య బీటెక్ చదువుతోంది. ఇందులో ఐశ్వర్యకు నాట్యంపై మక్కువ ఉండడంతో కొత్తగూడెంలో శిక్షణ ఇప్పించగా పలుచోట్ల ప్రదర్శనలు ఇస్తోంది. ఇక చైత్ర ఓ యూట్యూబ్ చానల్‌లో న్యూస్ రీడర్‌గా రాణిస్తోంది.

మహిళా దినోత్సవం రోజే జననం


వైద్య సేవలు అందిస్తున్న కమలారాణి

చుంచుపల్లి: మహిళా దినోత్సవం నాడే జన్మించిన చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీకి చెందిన కొచ్చర్ల కమలారాణి మహిళలకు సేవ చేయాలనే సంకల్పం, అంతరించిపోతున్న మర్మకళకు ప్రాణం పోసేందుకు నడుం బిగించారు. వైద్యశాఖలో 35 ఏళ్లు, థియేటర్ అసిస్టెంట్‌గా 22 ఏళ్ల అనుభవం ఉండగా.. ఆయుర్వేదం, ఆక్యుప్రెషర్ కోర్సుల్లో డిప్లొమా పూర్తి చేశారు. ఆపై 'శరణబోధి' పేరిట క్లినిక్‌లో వైద్యం అందిస్తున్నారు. పూర్వకాలంలో మోకాళ్లు, భుజాలు, మెడ, నడుపు, కీళ్ల నొప్పులకు చేతుల ద్వారా చేసే చికిత్సను కైరో ప్రాక్టర్‌గా పిలుస్తారు. ఇందులో పట్టు సాధించిన కమలారాణికి తెలంగాణలోనే మొదటి మహిళకు పేరుంది. అంతేకాక యోగా శిక్షణ ఇస్తూనే బౌద్ధమతం స్వీకరించి బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ రామవరంలో బౌద్ధ ఆరామాలు రక్షించే ఉద్దేశ్యంతో కమిటీ సభ్యులతో కలిసి అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

అన్ని రంగాల్లో సత్తా చాటాలి..


టేకులపల్లి: బొమ్మనపల్లి పాఠశాలలో డీడబ్ల్యూఓ స్వర్ణలతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు/ఇల్లెందురూరల్/టేకులపల్లి/సింగరేణి(కొత్తగూడెం): మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎక్కడైనా రాణించే సత్తా మహిళలకు ఉందని పేర్కొన్నారు. టేకులపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, ప్రమీల, లక్ష్మి, తార, జ్యోతిరాణి, పద్మ, విజయ, అంజలి, కొత్తగూడెంలో శారద, చింతలచెర్వు గేర్సోము, ఇల్లెందులో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి, యెలుగూరి జయశ్రీ, అర్వపల్లి విజయలక్ష్మి, చిన్నప్పయ్య, కండె సావిత్రి, ప్రొద్దుటూరి మణి, కటకం అలేఖ్య, బోనగిరి కల్పన, ప్రభాకర్‌రావు, కృష్ణవేణి, శేఖర్, సరిత, లక్ష్మణ్‌రావు, ప్రభుదయాల్, సంధ్య, శాంత, గంగ, రాజేశ్వరి, దేవి, పద్మ, మంగ, మరియా, కుమారి, కవిత, జ్యోతి, చంద్రకళ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ

పాల్వంచరూరల్: వేసవి కాలంలో విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.75 లక్షలతో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఐటీడీఏ కాంప్లెక్స్, కేవీస్పీరోడ్డు, రాంనగర్, బాపూజీనగర్, వనమానగర్, వికలాంగులకాలనీ, నెహ్రూనగర్, శాస్త్రీరోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం ఎస్ఈ ప్రారంభించి మాట్లాడారు. ఎండాకాలంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేసేవిధంగా పట్టణ పరిధిలో కొత్తగా 20 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు పాల్వంచ సబ్‌స్టేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ నందయ్య, ఏఈలు ప్రతాప్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాలు గుర్తించేలా సర్వే


మాట్లాడుతున్న నాగరాజశేఖర్

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల సామర్థ్యాలు గుర్తించేలా సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ సర్వే కోసం నియమితులైన ఆయన రెండు రోజులుగా కొత్తగూడెంలో జరుగుతున్న శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో శుక్రవారం పాల్గొని మాట్లాడారు. పిల్లలను ప్రేమతో పలకరించి సమాధానాలు రాబట్టాలని సూచించారు. సర్వేలో 50 మంది క్షేత్ర పరిశీలకులు, 586 మంది పిల్లలను పరిశీలించనున్నారని తెలిపారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా అశ్వారావుపేటకు చెందిన శ్రీశైలం, దమ్మపేటకు చెందిన రమేశ్‌బాబు వ్యవహరించారు.

కార్మికుల పనివేళలు మార్చండి..


వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఇల్లెందురూరల్: ఎండ తీవ్రతను పరిగణనలోకి తీసుకొని గ్రామ పంచాయతీ కార్మికుల పనివేళల్లో మార్పు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు శుక్రవారం ఎంపీడీఓ ధన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు రెండు పూటలా విధులు నిర్వహించడం వల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున విధులను ఒక పూటకు కుదించాలని కోరారు. అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, బోయిని పద్మ పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు నిర్వహించాలి

టేకులపల్లి: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఇతర ఏజెన్సీ జిల్లాల్లో నేటికీ తునికాకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయకపోవడం వల్ల ఆదివాసీ ప్రాంత ప్రజలు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని యూనిట్లలో టెండర్లను పూర్తి చేసి సకాలంలో తునికాకు ప్రూనింగ్ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో కల్తి వెంకటేశ్వర్లు, భూక్యా హర్జ, గుగులోతు రామచందర్, మేకల వినోద్, పాయం సమ్మయ్య, పొట్టయ్య, చింతా లాలమ్మ, ధరావత్ వెంకన్న, బాలు, మంగిలాల్ పాల్గొన్నారు.

రూ.5 చెల్లించాలి

పాల్వంచరూరల్: తునికాకు టెండర్లు నిర్వహించి 50 ఆకుల కట్టకు రూ.5 చొప్పున చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాంబాబు, మల్లేశ్, రాజు, వెంకన్న పాల్గొన్నారు. ఇదే అంశంపై మాస్‌లైన్ నాయకులు అటవీశాఖాధికారికి వినతి పత్రం అందించారు. నూపా భాస్కర్, కల్లూరి కిశోర్, గోనేల రమేశ్, వెంకటేశ్వర్లు, వేల్పుల రమేశ్, కుంజా తదితరులు భాస్కర్ పాల్గొన్నారు.

ప్రూనింగ్ ప్రారంభించాలి

ఇల్లెందురూరల్: తునికాకు సేకరణ టెండర్లు నిర్వహించి, ప్రూనింగ్ పనులు ప్రారంభించాలని కోరుతూ న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొమరారం అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పొడుగు నర్సింహారావు, మోతీలాల్, బానోత్ సంతు, మోకాళ్ల కృష్ణ, మూడు మాలు, జోగ కృష్ణ, నర్సయ్య, పాపయ్య, సుమలత పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు


తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బంది అర్హతలను పరిశీలించారు. అర్హత కలిగిన వారే స్కానింగ్ నిర్వహించాలని, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో డిప్యూటీ డెమో ఫైజ్ మొహిద్దిన్, డాక్టర్ ఆర్‌పీ చైతన్య, డీపీఎంఓ పాయం శ్రీను పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న కమిషనర్ శేషాంజన్‌స్వామి

కొత్తగూడెంఅర్బన్: మెప్మాలోని సభ్యులకు రుణాలు మంజూరు చేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తెలిపారు. పట్టణ పరిధిలోని 30వ వార్డు మధురబస్తీలో ఇందిరా మహిళాశక్తి పథకం కింద ఏర్పాటు చేసిన బ్యూటీపార్లర్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. బ్యూటీపార్లర్ యూనిట్‌కు రూ.5 లక్షలు ఎస్‌బీఐ నుంచి మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రవికుమార్, డీఎంసీ రాజేశ్, స్త్రీనిధి ఆర్‌ఎం శ్రీనివాస్, టీఎంసీ బి.వెంకటేశ్వర్లు, సీఓలు శాంతకుమార్, సరిత, మౌలాలీ, ఆర్‌పి శారద, పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ప్రభుత్వాలు

పాల్వంచరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక చంద్రరాజేశ్వరరావు భవనంలో శుక్రవారం జరిగిన రైతు సంఘం ప్రథమ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయం రంగం దెబ్బతింటే అన్ని రంగాలపై దాని ప్రభావం పడుతుందని తెలిపారు. సభలో బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు నరాటి ప్రసాద్, బండి నాగేశ్వరరావు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, ఎం.శ్రీను, చెన్నయ్య, రాజశేఖర్, విజయ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక


కొంగర అప్పారావు


బానోత్ రంజిత్

పాల్వంచరూరల్: స్థానిక సీఆర్ భవనంలో శుక్రవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కిన్నెరసానికి చెందిన కొంగర అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా నాగారం గ్రామానికి చెందిన బానోత్ రజింత్‌తోపాటు పదకొండు మంది ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కిన్నెరసానిని సందర్శించిన జపాన్‌వాసులు


బోటు షికారు చేస్తున్న జపాన్‌వాసులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని శుక్రవారం జపాన్‌కు చెందిన ముగ్గురు సందర్శించారు. డీర్ పార్కులోని దుప్పులు, జలాశయాన్ని వీక్షించి, బోటు షికారు చేశారు.

కనీస వేతనాలు అందించాలి

సింగరేణి(కొత్తగూడెం): జీఓ నంబర్ 22 ప్రకారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల చైర్మన్ జనక్ ప్రసాద్‌ను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.